
కాన్వెంట్ జంక్షన్‌కు కొత్త కళ తీసుకొచ్చిన అంబేడ్కర్ కూడలి



ఆకట్టుకుంటున్న వైజాగ్ పోర్ట్ సింబల్


పోర్టు ముఖద్వారం వద్ద ఆకట్టుకుంటున్న సీహార్స్ ప్రతిమలు

అందంగా.. ఆకర్షణీయంగా..

- చూడముచ్చటగా డాల్ఫిన్ కూడలి
- సరికొత్తగా సీహార్స్ ప్రతిమలు
- అదనపు హంగులతో జ్ఞానాపురం అంబేడ్కర్ జంక్షన్
- పచ్చదనం నడుమ వైజాగ్ పోర్ట్ సింబల్


డాల్ఫిన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటైన్

జగదాంబ : విశ్వనగరంగా ఖ్యాతి గడిస్తున్న విశాఖ రోజురోజుకు సరికొత్త అందాలను సంతరించుకుంటోంది. కాస్మోపాలిటన్ అందాలతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో దక్షిణలోని పలు ఏరియాలు మునుపెన్నడూ చూడనంత అందంగా.. ఆకర్షణీయంగా రూపొంది చూపరుల చేత 'వావ్..'అనిపిస్తున్నాయి.

దేనికదే సాటి..

అల్లిపురం దరి డాల్ఫిన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్ ఆ ప్రాంతానికి కొత్త అందాలద్దుతోంది. గ్రీన్ సర్కిల్ నడుమ రెండు డాల్ఫిన్లు నీటిని బయటికి వెదజల్లుతున్నట్లు ఏర్పాటు చేసిన ప్రతిమలు అటుగా ప్రయాణించే వాహన చోదకులు.. పాదచారులను ఆకట్టుకుంటున్నాయి. అదే విధంగా పోర్టు ముఖద్వారం వద్ద గల సీహార్స్ (సముద్ర గుర్రాలు) కొంత కాలం క్రితం శిథిలమైపోయాయి. అయితే ఇటీవల వాటికి మరమ్మతు చేసి సరికొత్తగా తీర్చిదిద్దారు. రౌండ్ రెయిలింగ్ ఏరియాలో ఏర్పాటు చేసిన సీహార్స్ చూపరుల మనసు దోచుకుంటున్నాయి. అలాగే జ్ఞానాపురంలో ఏర్పాటు చేసిన వైజాగ్ పోర్ట్ సింబల్ కూడా ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. గ్రీనరీ, స్టీల్ రెయిలింగ్ నడుమ ఏర్పాటైన ఆ సింబల్ జ్ఞానాపురం ప్రాంతానికి సరికొత్త అందాలు తెచ్చిపెట్టింది. ఇక చివరిగా జ్ఞానాపురంలోనే ఏర్పాటైన అంబేడ్కర్ కూడలి కూడా చూడముచ్చటగా రూపుదిద్దుకుంది. చక్కటి సర్కిల్‌లో పూలమొక్కలు, రంగులు, విద్యుత్ కాంతులతో ఏర్పాటు చేసిన ఈ ప్రతిమ ఆ ప్రాంతం నుంచి చాలా దూరం వరకు కనిపించేలా సుందరంగా తీర్చిదిద్దారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం


ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏటీఎం మిషన్ ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్ట్


ధ్వంసమైన ద్వారకానగర్ వద్ద గల ఏటీఎం మిషన్

సీతమ్మధార : డైమండ్ పార్కు దరి బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంను మద్యం తాగిన వ్యక్తి ధ్వంసం చేసిన ఘటన ద్వారకానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధురవాడకు చెందిన మానేపల్లి మణికంఠ పూటుగా మద్యం సేవించి డైమండ్ పార్కు సమీపంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంలోకి ప్రవేశించాడు. నగదు దోచుకునేందుకు ఏటీఎం మిషన్‌ను పగులగొట్టడంతో స్థానికులు బ్యాంకు అధికారులు, పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ద్వారకా సీఐ ఎస్.రమేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని మణికంఠను అదుపులోకి తీసుకున్నారు. బ్యాంకు మేనేజర్ సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు మణికంఠను అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం


సందీప్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఆర్డీవో హుసేన్‌సాహెబ్

మహారాణిపేట : పెదగంట్యాడ మండల పరిధిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వై. సందీప్‌కు సంజీవని నిధి (డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్) ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం అందింది. కలెక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు విశాఖ రెవెన్యూ డివిజన్ అధికారి డి. హుస్సేన్‌సాహెబ్ గురువారం సందీప్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. మందుల కొనుగోలు, ఇతర వైద్య ఖర్చుల నిమిత్తం సందీప్‌కు ఆర్థిక సాయం చేసినట్లు ఆర్డీవో తెలిపారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎ. త్రినాథరావు కలెక్టర్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

18 నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం


మాట్లాడుతున్న ఔషధాలయ మేనేజర్ దినూప్

డాబాగార్డెన్స్ : ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందించేందుకు ఈ నెల 18 నుంచి 21 వరకు కేరళ ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్టు వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలోని ఓ హోటల్లో ఆయన మాట్లాడారు. ప్రముఖ కేరళ వైద్యుడు డాక్టర్ కేఎం ఉన్నికృష్ణన్ నాయర్ 4 రోజుల పాటు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. డాక్టర్‌ను సంప్రదించాలనుకునేవారు అపాయింట్‌మెంట్ కోసం 7675861446, 0891–2568264 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. చర్మవ్యాధులు, ఆర్థ్రైటిస్, సైనసైటిస్, సొరియాసిస్, ఒత్తిడి, ఈఎన్‌టీ సమస్యలు, హైపర్ టెన్షన్, కీళ్ల వ్యాధులు, నడుం నొప్పి, స్పాండిలైటిస్, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య శిబిరంలో డాక్టర్ నాయర్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. మురళీనగర్ శ్రీదేవి పార్క్ సమీపాన గల తమ కేంద్రంలో నేరుగా వచ్చి కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

ఉచిత యోగా శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీ కాలనీ: రుషి గాయత్రి యోగా సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. ఈ నెల 19 నుంచి 14 రోజుల పాటు ఈ శిక్షణ జరగనుంది. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 94403 95439 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సమ్మర్ క్యాంపులతో విజ్ఞానం.. వినోదం


మాట్లాడుతున్న జెడ్పీహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు జోజిబాబు


శిబిరంలో పుస్తకాలు చదువుకుంటున్న చిన్నారులు

అల్లిపురం : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలని జెడ్పీహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఐ.జోజిబాబు అన్నారు. అల్లిపురం శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తకం విజ్ఞాన గని అన్నారు. పుస్తకాల ద్వారా విద్యార్థులు జ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. జిల్లా గ్రంథాలయాల్లో అన్ని రకాల పుస్తకాలు, గొప్పవారి జీవిత చరిత్రలు ఉంటాయన్నారు. వాటిని చదివి విజ్ఞానం పెంచుకోవాలన్నారు. శాఖా గ్రంథాలయం అధికారి పీవీఎస్ రాజు మాట్లాడుతూ చిన్నారులు సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జూన్ 7 వరకు.. 24 రోజుల పాటు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 10 నుంచి 15 ఏళ్ల మధ్య గల విద్యార్థులు అర్హులని తెలిపారు. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనే విద్యార్థులకు కార్టూన్ పుస్తకాలు అందజేస్తానని తెలిపారు. సమ్మర్ క్యాంపు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులో ప్రతిరోజు కథలు చదవడం, వినడం, హ్యాండ్ క్రాఫ్ట్స్, ఆటలు, పాటలు, స్పోకెన్ ఇంగ్లీషు వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

కుటుంబం చెంతకు మహిళ


కుమారుడు, కుమార్తెతో బసుమతి మండల్

అల్లిపురం : గత ఏడాది డిసెంబర్‌లో తమకు అందిన సమాచారం మేరకు భీమిలిలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఒక మహిళను ఏయూటీడీ టీఎస్ఆర్ కాంప్లెక్స్ సిబ్బంది తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. వసతి గృహంలో ఉండగానే ఆమెకు చికిత్స అందించడంతో ప్రస్తుతం ఆమె కోలుకుని తన వివరాలు చెప్పగలిగింది. తన పేరు బసుమతి మండల్ అని, తమది పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లాకు చెందిన మొల్లాబెలియా గ్రామమని స్పష్టం చేసి.. తమ చిరునామా కూడా తెలిపింది. దీంతో ఏయూటీడీ సిబ్బంది పూణేలోని శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులకు సమాచారం అందజేశారు. వారు మహిళ కుమారుడు గోపాల్ మండల్, కుమార్తెకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె కుమారుడు గోపాల్ మండల్ మాట్లాడుతూ తమ తండ్రి వేరే పెళ్లి చేసుకుని బెంగళూరు వెళ్లిపోయాడని, తన సోదరితో కలిసి కిరాణా దుకాణం నడుపుకుంటూ జీవిస్తున్నట్లు తెలిపాడు. తమ తల్లిని అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపాడు.

అప్రమత్తతతోనే డెంగ్యూ నివారణ


ర్యాలీ నిర్వహిస్తున్న దొండపర్తి పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శ్రావణి, సిబ్బంది

సీతమ్మధార : డెంగ్యూతో అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో గల పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రావణి తెలిపారు. ప్రపంచ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. డెంగ్యూ నుంచి రక్షణకు దోహదపడే కరపత్రాలు పంపిణీ చేశారు. జిల్లా మలేరియా విభాగం సిబ్బంది, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

35వ వార్డులో..

జగదాంబ : డెంగ్యూపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలనీ జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. గురువారం ప్రపంచ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ 35వ వార్డు టౌన్‌కొత్తరోడ్డు వద్ద వైద్య, పారిశుధ్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే డెంగ్యూను నివారించవచ్చన్నారు. వీధులు, వార్డుల్లో అపరిశుభ్రతపై శానిటరీ ఇన్‌స్పెక్టర్, కార్యదర్శికి తెలపాలన్నారు. జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఏఎంహెచ్‌వో, సిబ్బంది

19 నుంచి బంగారమ్మ, పోలమాంబ ఉత్సవాలు


గొల్లలపాలెం గ్రామదేవత పోలమాంబ


పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 28వ వార్డులో వెలసిన బంగారమ్మ, పోలమాంబ ఉత్సవాలు ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అమ్మవార్లను పలువురు ప్రముఖులు దర్శించుకోనున్నారు.

బంగారమ్మ పండగ..

పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ పండగ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 21 వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పండగ చాటింపు చేపట్టనున్నారు. ఆ రోజు సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద స్టేజీ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. 20న సోమవారం తొలేళ్ల ఉత్సవం, సాయంత్రం 7 గంటల నుంచి స్టేజ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. 21న ప్రధాన పండగ జరపనున్నారు. ఉత్సవాల్లో గరిడీలు, కాళీ మాతా డ్యాన్స్‌లు, పులివేషాలు, తప్పిటగుళ్లు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. పితానిదిబ్బ, గొల్లలపాలెం, ప్రకాశరావుపేట, దిబ్బలపాలెం, భానోజీనగర్, కన్నయ్యపేట, విశ్వనాథం రోడ్డు, సింగ్ హోటల్ జంక్షన్ తదితర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు.

పోలమాంబ మహోత్సవం..

గొల్లలపాలెం గ్రామ ప్రజల ఆరాధ్యదైవం పోలమాంబ పండగ 19 నుంచి 21 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చాటింపు వేయనున్నారు. 20న తొలేళ్ల ఉత్సవం, 21న అనుపు కార్యక్రమం జరపనున్నారు. గొల్లలపాలెం, శెట్టిబలిజ సంఘం, బుద్ధలవానిపాలెం, రామ్‌నగర్, నెహ్రూనగర్, ఆది ఆంధ్ర గ్రామం, అశోక్‌నగర్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంత వాసులు పోలమాంబను ఆరాధిస్తుంటారు. పండగ నేపథ్యంలో స్థానికులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. ప్రధాన పండగ మంగళవారం రోజున అమ్మవారి సదును పట్టు (ఆర్టీ క్లబ్ గొల్లలపాలెం) నుంచి అమ్మవారిని ధూప, దీప, నైవేద్యాలు, బాజా భజంత్రీలు, తప్పిటగుళ్లు, చెక్క భజన, పులివేషాలు, సాముగరిడీలతో భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. 28న మారువారం జరపనున్నారు. ఉత్సవంలో భాగంగా వచ్చే నెల 9న ఆలయ ప్రాంగణం వద్ద పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పోలమాంబ అమ్మవారి ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

19న బల్లిగిరి వెంకన్న తిరు కల్యాణోత్సవం


బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవం ఈ నెల 19వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. 18వ తేదీ శనివారం అంకురార్పనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్టుకు స్నపన తిరుమంజన సేవ, నూతన వస్త్రాలంకరణ, స్వామి, అమ్మవారిని పెండ్లి కుమారుడు, కుమార్తె అలంకరిస్తామన్నారు. సాయంత్రం దేవస్థానం మండపంలో ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు, వేదపండితులు ఉత్సవ సంకల్పం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విశ్వక్షేణపూజ, పుణ్యాహవచనం, స్థల శుద్ధి మృత్యం గ్రహణం, అంకురార్పణ, వాస్తు మండపారాధన పూజ, అధివాసం, అగ్నిప్రతిష్ఠ, విశేష హోమాలు, నివేదన ఉంటాయన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనదలచిన దంపతులు ఆలయ కార్యాలయంలో రూ.1,116 చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఇంకా ఎన్నికల మూడ్‌లోనే..


సరస్వతి పార్క్‌లో జోరుగా సాగుతున్న రాజకీయ చర్చలు


పార్టీల గెలుపు, అభ్యర్థుల విజయంపై చర్చించుకుంటున్న వ్యక్తులు

- ఏ ఇద్దరు కలిసినా రాజకీయ చర్చలే
- జోరుగా వాదనలు.. విశ్లేషణలు

డాబాగార్డెన్స్ : ఎన్నికలు ముగిసి మూడు నాలుగు రోజులైనా చాలా మంది ఇప్పటికీ అదే జోష్‌లో ఉన్నారు. ఏ ఇద్దరు కలిసినా ఎవరు గెలుస్తారు? ఏ పార్టీ విజయం సాధిస్తుంది అంటూ ఆరా తీస్తున్నారు. ఫలానా పార్టీ గెలుస్తుందని, ఆ నాయకుడు నెగ్గుతాడు అని ఒకరు చెబితే.. రెండో వారు దానిని ఖండిస్తున్నారు. తన అంచనా.. విశ్లేషణ ఇలా ఉందంటూ వాదనకు దిగుతున్నారు. బడ్డీలు, కూరగాయల దుకాణాలు, సెలూన్లు, వాకింగ్ ట్రాక్‌లు, పార్కుల దగ్గర ఇటువంటి దృశ్యాలు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. పార్టీల గెలుపు, నాయకుల విజయం గురించి చర్చించుకుంటున్నది.. వాదులాడుకుంటున్నది స్నేహితులు, కుటుంబ సభ్యులే కావడం విశేషం. ఎవరి వాదన వారిది కావటం వల్ల ఒకరు చెప్పేది మరొకరికి నచ్చటంలేదు. వినేవాళ్లకు ఇదంతా వినోదంగా ఉంది.

మరో 20 రోజుల్లో..

ఇదిలా ఉండగా మరో 20 రోజుల్లో ఎన్నికల ఫలితాలు రానున్నాయి. మళ్లీ చర్చలు, విశ్లేషణలు, వాగ్వాదాలు జరిగే అవకాశం కనిపిస్తుంది. రాజకీయ పార్టీల నాయకుల కన్నా కార్యకర్తలు.. అభిమానులు ఫలితాల కోసం ఎక్కువగా ఎదురు చూస్తున్నారు. తటస్థులు మాత్రం ఏ పార్టీ గెలిస్తే ఏముంది.. అంటూ పెదవి విరుస్తున్నారు.

వృద్ధులకు కాలక్షేపంగా..

ఈ ఎన్నికలు వృద్ధులకు కాలక్షేపంగా మారాయి. పదవీ విరమణ చేసి శేషజీవితం హాయిగా గడపాల్సిన వారంతా ఇంకా ఎన్నికల మూడ్ నుంచి బయటపడలేదు. ఎండలకు ఇంటి పట్టునే ఉన్న వారంతా సాయంత్రం 4 గంటలు కాగానే పార్కుల వద్దకు చేరుకుంటున్నారు. కొంత మంది వృద్ధులు వాకింగ్ చేస్తూ రాజకీయాలు మాట్లాడుకుంటుంటే.. మరి కొంత మంది వృద్ధులు రాజకీయ విశేషాలు మాట్లాడుకునేందుకే పార్కులకు చేరుకుంటున్నారు. రాత్రి పొద్దు పోయే వరకు అక్కడే కాలక్షేపం చేస్తూ కనిపిస్తున్నారు. న్యూకాలనీలోని రైల్వే వాకింగ్ గ్రౌండ్, దొండపర్తిలోని డైమండ్ పార్క్, డాబాగార్డెన్స్‌లోని సరస్వతి పార్కులో ఇటువంటి దృశ్యాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

పెరుగుతున్న సేంద్రియ ఉత్పత్తుల వినియోగం

బీచ్ రోడ్డు: ప్రపంచ వ్యాప్తంగా సేంద్రియ ఉత్పత్తుల వినియోగం గణనీయంగా పెరుగుతోందని ఇనెరా సంస్థ సీఈవో ఆగమ్ ఖరే తెలిపారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో సేంద్రియ వ్యవసాయంలో పరికరాల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పరంపరాగత్ కృషి వికాస్ యోజన కార్యక్రమం ద్వారా సేంద్రియ ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. రసాయన రహిత వ్యవసాయాన్ని వృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయంపై ప్రచారం చేసేందుకు క్రికెటర్ ఎంఎస్ ధోని అంగీకరించడం మంచి పరిణామమని చెప్పారు.

కాలువల పరిశుభ్రతకు ఏఎంహెచ్‌వో చర్యలు


పందుపుల్లల సందు వద్ద కాలువ శుభ్రం చేయిస్తున్న ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్

జగదాంబ : కాలువల్లో మురుగు నీరు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.రాజేష్ అన్నారు. గురువారం జీవీఎంసీ 35వ వార్డులో కాలువలను పరిశీలించిన ఆయన జోన్ పరిధిలో అన్ని వార్డుల్లోని ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్ వంటివి తొలగించి శుభ్రం చేయాలని వార్డు ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. దగ్గరుండి కాలువలను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.